# సాక్షి శ్రీకాకుళం

బుధవారం। 12। జూన్। 2024





**వెద.. మంచిదే కదా**

వెద పద్ధతే మేలని నిపుణులంటున్నారు. పెట్టుబడి తగ్గాలంటే వెద జల్లుకోవాలని సూచిస్తున్నారు. - 8లో



**అంబరాన్నంటిన సంబరం**

కవిటిలో చింతామణి అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - 8లో




**రోడ్డు ప్రమాదంలో..**

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎల్ఎన్‌పేటలో ఘటన జరిగింది. - 8లో


## న్యూస్‌రీల్

### సెబ్ ఏఈఎస్‌గా వినీషా



సెబ్ జేడీ గంగాధరంకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఏఈఎస్ వినీషా

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) యూనిట్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్‌గా (ఏఈఎస్)గా ఎం.వినీషా మంగళవారం విధుల్లో చేరారు. జిల్లాలో రెండు సెబ్ యూనిట్లు (శ్రీకాకుళం, పలాస) ఉండగా పలాసకు ఏఈఎస్‌గా ఐ.ఎ.బేగం వ్యవహరిస్తున్నారు. వినీషా 2022లో గ్రూప్–1లో ఎంపికై అనంతపురంలో శిక్షణ పూర్తి చేసుకుని శ్రీకాకుళానికి తొలి పోస్టింగ్‌లో వచ్చారు. ఈమె స్వస్థలం తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్. నాన్‌లోకల్ కేటగిరీలో ఎంపికయ్యారు. విధుల్లో చేరిన అనంతరం ఫరీదుపేట సమీపంలో ఉన్న జిల్లా సెబ్ కార్యాలయానికి వెళ్లి జేడీ(అదనపు ఎస్పీ) డి.గంగాధరంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

### పరిపాలన భవనం పరిశీలన



భవనం నిర్మాణ పనులను వీసీ రజనితో కలిసి పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రూ. 35.82 కోట్లతో నిర్మించిన పరిపాలన భవనం చివరి దశకు చేరుకుంది. ఈ భవనాన్ని మంగళవారం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజిని, నిర్మాణం చేపట్టిన కేంద్ర ప్రజాపనుల విభాగం అధికారులు పరిశీలించారు. ఈ భవనం పనులు పూర్తిగా ఈ నెల చివరి నాటికి పూర్తిచేసి, ఈ విద్యా సంవత్సరంలో వినియోగంలోకి తీసుకు రానున్నట్లు అధికారులు తెలిపారు. జీ+4 విధానంలో నిర్మించిన భవనాన్ని మొత్తం అధికారులు పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, రన్నింగ్ నీటి సరఫరా, లిఫ్ట్ వంటి అంశాలను పరిశీలించారు. పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలతో భవనం నిర్మించినట్లు కేంద్ర ప్రజాపనుల విభాగం అధికారులు ఎ.శ్రీనివాసులు, ఐ.శ్రీనివాస్ నాయక్ తెలిపారు. భవనాన్ని కాంట్రాక్టర్ గడువు మేరకు వర్సిటీకి అప్పగిస్తున్నట్లు చెప్పారు. పరిశీలనలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయ్‌భాస్కర్, సీహెచ్ రాజశేఖరరావు ఉన్నారు.

### అండర్-23 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తదితరులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నుంచి అండర్–23 నార్త్ జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు ప్రారంభించారు. మొదటి రోజు శ్రీకాకుళం–విశాఖపట్నం జట్లు తలపడగా, మొదట బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 273 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు 31.1 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌటైంది. నిర్వాహకులు ఎస్.లాల్‌బహదూర్, పీడీ లక్ష్మణమూర్తితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ వెలుగుల్లో కలెక్టరేట్

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నేడు ప్రమాణస్వీకారం చేయనుండటంతో మంగళవారం జిల్లాకేంద్రంలోని అన్ని ప్రభుత్వ ముఖ్య కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కలెక్టర్ కార్యాలయం, మున్సిపల్, డీఆర్డీఏ, ఆర్డీవో, జిల్లాపరిషత్, డ్వామా, ఏపీఎంఐపీ, మైనింగ్, కోఆపరేటివ్, సమాచార పౌరసంబంధాల అధికారి, సెట్‌శ్రీ, పర్యాటక కార్యాలయాలతో పాటు అన్ని కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. - శ్రీకాకుళం పాతబస్టాండ్



## అంకెలు కాదు ఆపద్బాంధవులు

శ్రీకాకుళం సమీపంలోని పొన్నాడ వంతెన వద్ద ఓ యువతి ఆందోళనగా కనిపించడంతో సమీపంలో ఉన్న వ్యక్తికి అనుమానం వచ్చి 100కు డయల్ చేశాడు. కంట్రోల్ రూం నుంచి ఒకటో పట్టణ ఎస్ఐకు సమాచారం రావడంతో వెంటనే స్పందించి హెడ్‌కానిస్టేబుల్ అక్కడకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడబోతున్న ఆమెను అడ్డుకున్నారు.

బలగ–బొందిలీపురానికి చెందిన ఓ యువతి కొత్త బ్రిడ్జి వద్ద నదిలో దిగి సూసైడ్‌కు యత్నించే క్రమంలో ఉందని 100కు ఓ కాల్ వచ్చింది. వెంటనే మహిళా కానిస్టేబుల్ మిరియా హిమబిందు అక్కడకు చేరి ఆమె ప్రాణాలు కాపాడింది.

అరసవిల్లి శ్రీ శయన వీధికి చెందిన ఓ వివాహిత తన భర్త వేధింపులు తాళలేక దిశా యాప్ ఎస్ఓఎస్ బటన్ నొక్కడంతో ఒకటో పట్టణ పీఎస్ కానిస్టేబుల్ సకాలంలో స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని అతన్ని స్టేషన్‌కు తీసుకువచ్చేశారు.

ఆపద వేళ ఆపద్బాంధవులను పిలిచేందుకు ఈ నంబర్లు గుర్తుండడం అత్యవసరం. తల్లిదండ్రులు, జీవిత సహచరుల నంబర్లతో పాటు ఈ నంబర్లను కూడా విధిగా సేవ్‌చేసుకుని అవసరం అనుకున్న వేళ వాడుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

- ఆపద సమయాల్లో ఆదుకునే 100, 112, 182, 1098 నంబర్లు
- యువతులు, చిన్నారులు, మహిళలకు వరం
- వీటికి తోడు మహిళల సంరక్షణకై దిశా కాల్స్
- ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉంటామంటున్న పోలీసులు



శ్రీకాకుళం క్రైమ్/ హిరమండలం:

పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటున్నారు. కాల్ రావడమే ఆలస్యం ఘటనా స్థలానికి వచ్చి వాలిపోతున్నారు. అవసరం అనుకుంటే అరెస్టులు కూడా చేస్తున్నారు. మనం చేయాల్సిందల్లా ఒకే ఒక్క పని. అత్యవసర వేళ సంకోచించకుండా ఎమర్జెన్సీ కాల్ చేయడం. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరిగే ఆకృత్యాలను అడ్డుకోవడానికి, చిన్నారులపై, యువతులపై లైంగిక దాడుల జరిపే నేరగాళ్ల పనిపట్టడానికి ఈ ఎమర్జెన్సీ కాల్ ఎంతో ఉపయోగపడుతుంది. 24 గంటలూ అందుబాటులో ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని ఎమర్జెన్సీ టోల్‌ఫ్రీ నెంబర్లు ప్రవేశపెట్టాయి.

**100**

100 అనేది ఎప్పటినుంచో అందుబాటులో ఉన్న నంబర్. ఈ నంబర్‌కు డయల్ చేస్తే నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌నకు చేరుతుంది. బాధితులు తమ పరిస్థితి వివరించాక అక్కడి నుంచి సంబంధిత పీఎస్‌కు లైన్ కలిపి అలెర్ట్ చేస్తారు. జీపీఎస్ లోకేషన్ ఆధారంగా సమీపంలో ఉన్న పోలీసులు, గస్తీ వాహనాలను అప్రమత్తం చేయడమే కాక బాధితురాలు ధైర్యంగా ఉండేలా పలు సూచనలు చేస్తారు. పది నిమిషాల్లో అక్కడకు చేరుకుంటారు.

**1091**

మహిళలను అత్తింటివారు గానీ, భర్త గానీ హింసించడం, కొట్టడం వంటివి చేస్తే 1091కు కాల్ చేస్తే చాలు. ఇది నేరుగా మహిళా సెల్‌కు కనెక్ట్ అవుతుంది. అంతేకాక మహిళలపై దాడికి పాల్పడినప్పుడు ఎవరైనా బయట వ్యక్తి చూసినా ఈ నంబర్‌కు కాల్ చేయొచ్చు. పిల్లలను హింసించినా ఈ నంబర్‌కు కాల్ చేయొచ్చు.

**112**

గతంలో మహిళల సమస్యలపై నేరుగా 100కు డయల్ చేస్తే పోలీసు యంత్రాంగం వెంటనే అప్రమత్తమయ్యేది. ఇప్పుడా నంబర్‌కు అన్ని రకాల ఫిర్యాదుదారులు ఎక్కువ శాతం ఫోన్ చేస్తుండటంతో మహిళల సౌలభ్యం కోసం ప్రత్యేకించి 112 నంబరును కేంద్ర హోం శాఖ ప్రవేశపెట్టింది. బాధితులు దేశంలో ఎక్కడి నుంచైనా ఈ నంబర్‌కు కాల్ చేస్తే చాలు వారికి సంబంధించిన రాష్ట్రంలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌నకు చేరుతుంది. దీనికంటూ 112 మొబైల్ యాప్ కూడా ఉంది.

**182**

182 నంబర్ అనేది రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న ఆర్‌పీఎఫ్ పోలీస్ కంట్రోల్ రూమ్‌నకు చేరుతుంది. ఎవరైనా రైళ్లలో ప్రయాణించేటప్పుడు లైంగిక వేధింపులకు గురైనా, దొంగతనాలు, ఆపదలో ఉండే సందర్భాల్లో ఈ నంబర్‌కు కాల్ చేయొచ్చు. బాధితులు ప్రయాణిస్తున్న సంబంధిత రైలులో ఉండే ఆర్‌పీఎఫ్ పోలీసులకు కంట్రోల్ రూమ్ నుంచి మెసేజ్ వెళ్తుంది. వెంటనే బాధితులున్న బోగీల్లో పోలీసులు ప్రత్యక్షమై సమస్యను తీరుస్తారు.

**91212 11100**

మహిళలు ముఖ్యంగా యువతులపై జరిగే సైబర్ నేరాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సైబర్ మిత్ర పేరిట వాట్సాప్ నంబర్ 9121211100 ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. ఆపదలో ఉండి అత్యవసర పరిస్థితుల్లో ఈ నంబర్‌కు మెసేజ్ పంపిస్తే పోలీసులు వాలిపోతారు. ఈ నెంబరు 24 గంటలూ అందుబాటులో ఉంటుంది.

**మహిళల భద్రతకు..**



జిల్లాలో మహిళల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. మహిళలను వేధించే వారిపై ప్రస్తుత చట్టాలు కఠినంగా ఉన్నాయి. ప్రజలు ఎమర్జెన్సీ నంబర్లను వినియోగించుకోవాలి. – జి.ఆర్.రాధిక, ఎస్పీ, శ్రీకాకుళం

**దిశ యాప్ ఉందనే ఉంది..**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశా చట్టంపై ప్రజల్లో నమ్మకం పెరిగి జిల్లాలో రికార్డు స్థాయిలో 11,59,295 మంది దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోగా 3,15,990 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీనికి సంబంధించి యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ క్లిక్ చేస్తే చాలు ఆపదలో ఉన్న సంకేతాలు నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌నకు చేరి వెంటనే పోలీసులు అలెర్ట్ అయ్యి సమస్యను పరిష్కరిస్తారు.

**భార్యాభర్తల కేసులు**

| సంవత్సరం | ఫిర్యాదులు | ఎఫ్ఐఆర్ అయినవి |
|---|---|---|
| 2020 | 531 | 67 |
| 2021 | 754 | 71 |
| 2022 | 1002 | 114 |
| 2023 | 682 | 72 |
| 2024 (ఇప్పటి వరకు) | 18 | 02 |

**దిశ యాప్ ద్వారా వచ్చిన కాల్స్**

| సంవత్సరం | ఎస్ఓఎస్ కాల్స్ | టెస్ట్ కాల్స్ డీజీ కంట్రోల్‌రూం | ఎసైన్డ్ కాల్స్ | ఎఫ్ఐఆర్ |
|---|---|---|---|---|
| 2020 | 17 | 0 | 15 | 05 |
| 2021 | 6705 | 6507 | 198 | 26 |
| 2022 | 20240 | 19796 | 444 | 34 |
| 2023 | 2230 | 2094 | 138 | 08 |
| 2024 | 252 | 232 | 19 | 01 |

## ఏపీ ఈఏపీ సెట్.. మనవాళ్లు సూపర్‌హిట్



ఏపీ ఈఏపీ సెట్‌లో జిల్లా విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. చక్కటి ర్యాంకులు సొంతం చేసుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చారు. ర్యాంకులు సాధించిన వారికి కుటుంబ సభ్యులతో పాటు ఆయా గ్రామస్తులు అభినందించారు.

శ్రీకాకుళం న్యూకాలనీ:

మంగళవారం సాయంత్రం వెలువడిన ఏపీ ఈఏపీసెట్–2024 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు విజయదుందుభి మోగించారు. కార్పొరేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు టాప్ ర్యాంకులు దక్కించుకోగా.. గత ప్రభుత్వ హయంలో ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సైతం మెరుగైన ర్యాంకులు సాధించి సీట్లు నిలబెట్టుకున్నారు.



ఎం.మూర్తిమణిదీప్ ఎం.జస్విత్ ఎం.సతీష్‌చంద్ర



జె.శ్రీహర్షిత్ పి.పవన్‌సాయి హితేష్



మౌనిక సాయిఅమృత షేక్ అమీనా నాషీమ్

**ఇంజినీరింగ్ విభాగంలో..**

- శ్రీకాకుళం నగరంలోని సత్యనగర్‌కాలనీకి చెందిన మాడుగుల మూర్తి మణిదీప్ 87.4833 మార్కులతో రాష్ట్రస్థాయిలో 77వ ర్యాంకు సాధించాడు.
- శ్రీకాకుళం నగరంలోని ఇందిరానగర్‌కాలనీ పరిధిలోని గోవిందనగర్‌కాలనీకి చెందిన మావూరు జస్విత్ 84వ ర్యాంకు సాధించాడు.
- ఎచ్చెర్ల మండల పరిధిలోని కుశాలపురం గ్రామ పరిధిలోని శ్రీదుర్గాదేవి ఆలయం ఎదురుగా ఉన్న వీధిలో నివాసం ఉంటున్న మెట్ట సతీష్‌చంద్ర 157వ ర్యాంకు సాధించాడు.
- కవిటి మండల పరిధిలోని చిన్నజల్లుపుట్టుగ గ్రామానికి చెందిన జల్లు శ్రీహర్షిత్ 207వ ర్యాంకు సాధించాడు.
- శ్రీకాకుళం నగరానికి చెందిన పసగాడ పవన్ సాయి 243వ ర్యాంకు, బాడాన హితేష్ 309వ ర్యాంకు, వేదుల వెంకటశివసాయిసుబ్రహ్మణ్యం 1077వ ర్యాంకు, బరాటం సాయి వైష్ణవి 1095వ ర్యాంకు, గుంటుకు మోహన్ వంశీ 1306, బాలుడు వంశీ 1378వ ర్యాంకు, తంగి లోకేష్ 1474వ ర్యాంకు, సాలిహుందం ధీరజ్ 1590, లొడ్డి గిరిజాశంకర్ 1827వ ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయిలో మెరిశారు.
- పలాసలోని గాంధీనగర్‌కు చెందిన పొట్నూరు హితిన్‌సాయి 238వ ర్యాంకు, వివేకానంద కాలనీకి చెందిన తమ్మినేని అమృత 284వ ర్యాంకు,కొమ్మూరు సుధాన్వి 732వ ర్యాంకు, లావేరుకు చెందిన బొంతు లోకేష్ 427వ ర్యాంకు సాధించారు.

**అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో..**

- శ్రీకాకుళం నగరానికి చెందిన అంధవరపు మౌనిక అగ్రికల్చర్, ఫార్మసీ 789వ ర్యాంకు, పాగోటి సాయి అమృత 900వ ర్యాంకు, షేక్ అమీనా నాషీన్ 989వర్యాంకు,ఎ.లాస్యప్రియ 1087వ ర్యాంకు సాధించి రాణించారు. శ్రీకాకుళంలోని పెద్దపాడుకు చెందిన బాగు సుప్రియ 760వ ర్యాంకును సాధించింది

**నారాయణ కళాశాల విద్యార్థుల ప్రభంజనం..**

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలతోపాటు తాజాగా వెలువడిన ఏపీ ఈఏపీసెట్–2024 ఫలితాల్లో టాప్ ర్యాంకులతో శ్రీకాకుళం నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కళాశాల నుంచి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఆ విద్యాసంస్థల డీఎన్ మణికుమార్, ఏజీఎం తిరుపతిరావు, గంగాధర్, ప్రిన్సిపాల్ పి.ప్రసన్నకుమార్, జగన్, సత్యనారాయణ తదితరులు అభినందించారు.

**శ్రీచైతన్య విద్యార్థుల హవా..**

శ్రీకాకుళం శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదువుకుంటూ ఏపీ ఈఏపీసెట్–2024 ఫలితాల్లో పూర్తి హవా కనబరిచారు. విద్యార్థులను ఆ విద్యాసంస్థల డీఎన్ మురళీధర్, ఏజీఎం నర్సునాయుడు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

**81 ర్యాంకు**



సతీష్‌కుమార్

జలుమూరు: మండలంలోని కరవంజ గ్రామానికి చెందిన చింతు సతీష్ కుమార్ ఏపీ ఈఏపీ సెట్‌లో 81వ ర్యాంక్ సాధించాడు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో 8వ ర్యాంక్, జేఈఈ అడ్వాన్స్‌లో 637 ర్యాంక్ సాధించాడు. సతీష్ తల్లిదండ్రులు బుచ్చెన్న, రమాదేవి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

**సత్యవరం అమ్మాయికి**

**85 ర్యాంకు**



సుభాష్య

నరసన్నపేట: మండలం సత్యవరానికి చెందిన తొండ్రాపు సుభాష్య ఏపీ ఈఏపీ సెట్‌లో అగ్రికల్చర్ ఫార్మసీ బీఎస్సీ విభాగంలో 85వ ర్యాంకు సాధించింది. నీట్‌లో ఈ అమ్మాయికి 690 వ ర్యాంకు వచ్చింది. 85వ ర్యాంకు రావడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు శ్రీనివాసరావు, పద్మావతి తెలిపారు.

**86 ర్యాంకు**



తోట సుజాత

బూర్జ: తోటవాడ గ్రామానికి చెందిన తోట సుజాత 86 వ ర్యాంకు సాధించింది. ఆమె నీట్‌లోనూ 1500వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి తోట జ్యోతి బాబు ప్రభుత్వ ఉపాధ్యాయులు, తల్లి రోజారమా గృహిణి.

**89 ర్యాంకు**



జయకిశోర్

పొందూరు: మండలంలోని అచ్చిపోలవలస గ్రామానికి చెందిన గురుగుబెల్లి జయకిశోర్‌కు ఏపీ ఈఏపీ సెట్‌లో 89వ ర్యాంకు వచ్చింది. బైపీసీ స్ట్రీమ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో ఈ ర్యాంకును సాధించాడు. నీట్‌లో 705 మార్కులు సాధించి ఆల్ ఇండియా ర్యాంకు 1371, ఓబీసీ కేటగిరీలో 442వ ర్యాంకును పొందాడు. విద్యార్థి తండ్రి గురుగుబెల్లి సత్యనారాయణ ఎక్స్ ఆర్మీ, తల్లి సుజాత గృహిణి.

నరసన్నపేట: నరసన్నపేటకు చెందిన కోరాడ సాదీప్ రాష్ట్ర స్థాయిలో 124వ ర్యాంకును, జామి వెంకటనరేంద్రరావు 304 వ ర్యాంకును, గొండు సాయి ప్రణీత్ 411వ ర్యాంకును పొందారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ వీరు ప్రతిభ చూపారు.



కోరాడ సాదీప్ వెంకట నరేంద్ర సాయి ప్రణీత్

**12 ర్యాంకు**


**టెక్కలి విద్యార్థికి..**



కుటుంబ సభ్యులతో ప్రణవ్‌సాయి

టెక్కలి: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో టెక్కలికి చెందిన మలిపెద్ది ప్రణవ్ సాయి 12వ ర్యాంకు సాధించాడు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో ప్రణవ్‌సాయి 140 కు పైగా మార్కులు సాధించాడు. తాజాగా వెలువడిన నీట్ ఫలితాల్లో ఇదే విద్యార్థి ఆలిండియా స్థాయిలో 430వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 114 వ ర్యాంకు సాధించాడు. అలాగే తెలంగాణా ఎంసెట్ ఫలితాల్లో సైతం 62వ ర్యాంకు సాధించాడు. పట్టణానికి చెందిన మలిపెద్ది మదుసూధనరావు, సంతోషికుమారి దంపతుల కుమారుడు.

**24 ర్యాంకు**



బండి గౌతమి

పాతపట్నం: ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీసెట్)–2024లో పాతపట్నం మండలం తీమర గ్రామానికి చెందిన బండి గౌతమి సత్తా చూపించింది. పరీక్షల్లో ఆమె 24వ ర్యాంకు సాధించింది. నీట్‌లోనూ ఆల్ ఇండియా 925వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 288వ ర్యాంకు సాధించింది. తండ్రి బండి చిరంజీవి మృతి చెందడంతో తల్లి బండి భారతి గృహిణిగా ఉంటూ ఆమెను చదివించారు. టెన్త్ వమ్మరవల్లి రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకుంది. ఇంటర్ మీడియట్ పాతపట్నం ప్రభుత్వ మోడల్ కళాశాల (స్కూల్)లో పూర్తి చేసింది.

**128 ర్యాంకు**

**235 ర్యాంకు**



సాయిబదరీష్



సాత్విక్

కోటబొమ్మాళి: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో కోటబొమ్మాళికి చెందిన సకలాభక్తుల సాయిబదరీష్ 128 వ ర్యాంకు సాధించాడు. తండ్రి అనాధ గుప్తా వ్యాపారి .అలాగే పొడుగుపాడు గ్రామానికి చెందిన అన్నెపు సాత్విక్ 235వ ర్యాంకు సాధించాడు. తండ్రి కృష్ణారావు రైతు.

**743 ర్యాంకు**



ప్రణయ్

పోలాకి: పోలాకి గ్రామానికి చెందిన పాలబోయిన ప్రణయ్ ఏపీ ఈఏపీసెట్ లో 743వ ర్యాంక్ సాధించాడు. ప్రణయ్ తల్లి దండ్రులు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

## ఉత్సవం ఉవ్వెత్తున



పాతపట్నం మండలంలోని సీతారాంపల్లి, చంగుడి గ్రామాల్లో ఉన్న గ్రామదేవత ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. సీతారాంపల్లిలో నీలమణిదుర్గ అమ్మవారిని, చంగుడిలో దుంపగుండి పోలమ్మతల్లి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. యువకుల పగటి వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. - పాతపట్నం

## అందిన ద్రాక్ష తీయన..



మెళియాపుట్టి మండలంలోని పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన సలాన సత్యం అనే రైతు ఇంటి పెరట ద్రాక్ష చెట్ల విరగ్గాసింది. నాలుగేళ్ల కిందట ఆయన ఇక్కడ మొక్క నాటారు. ఏటా మంచి దిగుబడి ఇస్తోందని ఆయన తెలిపారు. - మెళియాపుట్టి

## క్లుప్తంగా

### కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం



చెట్టు పడిపోవడంతో ధ్వంసమైన దుకాణం

టెక్కలి రూరల్: స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని ఒక చెట్టు(తురాయి) మంగళవారం ఒక్కసారిగా కూలిపోయింది. రోడ్డు పక్కగా ఉన్న దుకాణాల వెనుక వైపు ఉన్న ఒక చెట్టు కూలి సమీప దుకాణాలపైన పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న టైలరింగ్ షాపు పూర్తిగా పాడైపోయింది. షాపు టైలరింగ్ చేస్తున్న నీలిమ అనే మహిళకు స్వల్పగాయాలయ్యాయి. చెట్టు పడేటప్పుడు పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని షాపు పైన పడిన చెట్టును తొలగించే ప్రయత్నం చేశారు. చెట్టు పడేటప్పుడు సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

### కడుపు నొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో ఓ యువకుడు తీవ్ర కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒకటో పట్టణ ఎస్‌ఐ కామేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్‌ఐ చెప్పిన వివరాల మేరకు.. ఏపీహెచ్‌బీ కాలనీలోని ఓ అద్దె ఇంటిలో లంకవలస అప్పన్న, కనక దంపతులు రెండేళ్లుగా నివసిస్తున్నారు. వీరు సంతోషిమాత గుడి సమీపంలో కూరగాయల మార్కెట్ నడుపుతున్నారు. వీరికి రోహిత్(22) ఒక్కడే కుమారుడు. రోహిత్ పదోతరగతి పాసైన వెంటనే నగరంలోని ఓ మెడికల్ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేశాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడం, తరచూ కడుపు నొప్పి రావడంతో మెడికల్ ల్యాబ్‌లో మానేసి ఇంటిపట్టునే ఉండేవాడు. గత నాలుగు రోజులుగా కడుపు నొప్పి తీవ్రంగా రావడంతో 'అమ్మా నేను భరించలేకపోతున్నాను. చనిపోవాలనిపిస్తుందంటూ' తల్లి కనకతో చెప్పేవాడు. సోమవారం ఉదయం తల్లిదండ్రులిద్దరూ బయటకు వెళ్లి రాత్రి ఏడు గంటలకు వచ్చేసరికి తలుపులు బిగించి ఉన్నాయి. లోపల చూస్తే రోహిత్ సీలింగ్ ఫ్యానుకు చీరతో ఉరేసుకుని కనిపించాడు. విషయం తెలిసి రాత్రి 11 గంటలకు ఘటనాస్థలికి ఎస్‌ఐ కామేశ్వరరావు, ఏఎస్‌ఐ చేరుకుని పరిశీలించారు. మంగళవారం రిమ్స్‌లో పంచనామా నిర్వహించి రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.


### ఆభరణాలు చోరీ



చీడివలస గ్రామంలో దర్యాప్తు చేస్తున్న ఇన్‌చార్జి ఎస్‌ఐ నాగరాజు

బూర్జ: మండలంలో గల చీడివలస గ్రామంలో కోడి అప్పలనాయుడుకి చెందిన ఐదు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అలాగే వెండి వస్తువులు సుమారు 15 తులాలు చోరీకి గురైనట్లు తెలియ జేశారు. గ్రామస్తులు, స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి అప్పలనాయుడు కుటుంబ సభ్యులతో ఇంటి గడపలో పడుకున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటిలో ఏదో అలికిడి రాగా వారు ఇంటిలోకి వెళ్లి చూశారు. వెనక తలుపులు తెరిచి ఉండడం గమనించారు. తలుపుల పక్కనున్న కిటికీ గ్రిల్స్ తీసివేసి ఉన్నాయి. ఇంటి లోపల బీరువా తెరిచి ఉంది. బీరువా అంతా పరిశీలించగా రెండున్నర తులాల బంగారం పుస్తెలతాడు, ఒక్క తులం చైను లాకెట్, అర్ధ తులం ఉంగరం, చెవిబుట్టలు అర్ధ తులం, అర్ధతులం చిన్న పిల్లల వస్తువులు కనిపించలేదు. దీంతో వారు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ ఆమదాలవలస-2 ఐ.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్ వెళ్లి పరిశీలించిందని ఆమదాలవలస సీఐ దివాకర్ యాదవ్ తెలిపారు. ఊరిలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో జనం ఆందోళన చెందుతున్నారు.

### డచ్ బంగ్లాకు లైటింగ్ ఏర్పాటు




డచ్ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణంలోని అతి ప్రాచీన, పురాతమైన కట్టడానికి లైటింగ్ ఏర్పాటు చేసినట్లు ఇంటాక్ కోకన్వీనర్ నటుకుల మోహన్ తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడనున్న కారణంగా ప్రభుత్వ ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, గొర్లె కిరణ్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు తదితరులు



వైఎస్ జగన్‌తో ఎమ్మెల్సీ నర్తు రామారావు, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, లోకేశ్వర రెడ్డి

### 'పార్టీ కార్యకర్తలు, అభిమానులకు అండగా నిలవాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రతి ఒక్కరికీ నాయకులంతా అండగా నిలబడాలని పార్టీ ముఖ్య నేతలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడులు చేస్తున్నారని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ధైర్యాన్నివ్వాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి మీరంతా కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, వరుదు కళ్యాణి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పలు కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దుంపల లక్ష్మణరావు, శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, లోకేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్ తదితరులు ఉన్నారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కృష్ణదాస్, తిలక్, రమేష్





వైఎస్ జగన్‌తో ఎంవీ స్వరూప్, దుంపల రామారావు

# వెద.. మంచిదే కదా

- వెద సాగుతో పెట్టుబడి తక్కువ
- కలుపు నివారణ సులువు
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

జలుమూరు: ఖరీఫ్ ప్రారంభమైపోయింది. ఇప్పటికే రైతులు తమ పొలాల్లో దుక్కులు పెడుతున్నారు. జిల్లాకు సంబంధించి వరి 2.30 లక్షలు హెక్టార్లు సాగవ్వగా ఇందులో వెద పద్ధతిలో 50 శాతం సుమారు 1.10 లక్షల హెక్టార్లు నాట్లు, ఉడుపు పద్ధతిలో మరో 1.20 లక్షలు ఎకరాలలో నాట్లు వేస్తుంటారు. సాధారణంగా ఉడుపు పద్ధతిలో నాట్లు వేస్తే రైతులకు దిగుబడి, నాణ్యమైన పంట వచ్చినప్పటికీ పెట్టుబడి ఖర్చులు అధికం అవుతుంటాయి. అందుకే రైతులు వెద పద్ధతిలో సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వెద పద్ధతి ఎంచుకునేందుకు రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుంటున్నారు. ప్రధానంగా మారిన వాతావరణ పరిస్థితుల్లో తక్కువ నీటితో లాభదాయకంగా దిగుబడులు పొందవచ్చు. ప్రతికూల పరిస్థితుల్లోనూ సాగు ఆలస్యమైనప్పుడు వెద పద్ధతి వల్ల సమయం ఆదా చేయవచ్చు.

**వెద పద్ధతితో ప్రయోజనాలు**

- తొలకరి వర్షాలు సద్వినియోగం చేసుకోవచ్చు.
- నారుమడి పెంపకం, నాట్లకు అయ్యే ఖర్చు సుమారు ఎకరాకు రూ.ఎనిమిది వేల నుంచి రూ.పది వేలు మిగులుతుంది.
- చెరువులు, కాలువల కింద సాగు చేసే వారు నాట్లు ఆలస్యం కాకుండా సకాలంలో వేసుకోవచ్చు.
- విత్తన మోతాదు 40-50 శాతం తగ్గించుకోవచ్చు.
- పంట నేలకు పడిపోకుండా పది నుంచి 15 రోజులు ముందు కోత కోసుకోచ్చు.
- తెగులు, పురుగుల బెడద తగ్గించుకోవచ్చు.
- కోత యంత్రాలతో సులువుగా పంట కోత కోసుకోవచ్చు.

**అధిక దిగుబడులకు విత్తన రకాల ఎంపిక**

లోతట్టు ప్రాంతాలు ముంపు ప్రాంతాలకు అనువైన రకాలు: ఎంటీయూ(1061) ఇంద్ర, ఎంటీయూ (1064)అమర, ఆర్‌జీఎల్ (2537) శ్రీకాకుళం సన్నాలు ఎత్తు ఎదిగి కాండ ధృడంగా ఉండి పడిపోని రకాలు సాగుచేసుకోవాలి.



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

సాధారణ కాలువలు, చెరువుల కింద పొలాలు: ఎంటీయూ 1121(శ్రీధృతి),ఎంటీయూ 3291( సోనామసూరి ) బీపీటి 5204( సాంబమసూరి) ఎంటీయూ 1210 (సుజాత) ఎంటీయూ 1262(మార్టేర్ సాంబ) ఎంటీయూ 7029(స్వర్ణ) వేసుకోవాలి.

**కాలువ చివరి భూములు, ఆలస్యంగా విత్తే ప్రాంతాలకు అనువైన రకాలు:** ఎంటీయూ 1156(తరంగణి).ఎంటీయూ 1153(చంద్ర), ఎన్‌ఎల్‌ఆర్ 34449 ఎంచుకోవచ్చు.

**నేల తయారీ**

వర్షాలు పడిన వెంటనే నేలను పలుమార్లు దున్ని మెత్తగా తయారు చేసిన తర్వాత కలుపు సమస్య కొంత వరకూ అధిగమించవచ్చు. ఆఖరి దుక్కిలో సిఫారసు మేరకు భాస్వరం, పొటాష్ తదితర ఎరువులు వేసి నేలను కలియ దున్నాలి. నేలలో తేమ సరిగా లేకపోతే మొలక రాదు. తేమను చూసుకొని రోటావేటర్‌తో విత్తనాలు వేసుకోవడం మంచిది.

కాలబాటల వల్ల పైరుకు వెలుతురు, గాలి తగలడం, ఎరువులు సులువుగా వేసుకోవడం, చీడపీడల నివారణ తదితర ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే విత్తనాలు పుట్టిన తర్వాత మొక్కలు లేని చోట కొత్త మొక్కలు వేసుకోవాలి.

**అధిక దిగుబడులకు సూచనలు**

- పంట పడిపోని, త్వరితగతిన కలుపు నివారణకు గల రకాలు ఎంచుకోవాలి.
- సరైన సమయంలో తగిన మోతాదులో కలుపు మందు పిచికారీ చేయాలి.
- కలుపు మందు పిచికారీ చేసే మయంలో పొలంలో నీరు పలుచగా ఉండేటట్లు చేసుకోవడంతో పాటు తర్వాత కూడా రెండు రోజుల వరకూ నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి.
- ఎరువులు విత్తిన 15 రోజులకు పిలక దశలో చిరు పొట్టదశలో వేయాలి.
- పొటాష్ ఎరువును విధిగా చిరుపొట్ట దశలో నత్రజనితోపాటు వేయాలి.
- చేనును కోత కోసే వారం రోజులు ముందు మాత్రమే ఎండగట్టాలి.

**మంచి విత్తనాలు వేసుకోవాలి**



రైతులు వెద పద్ధతిలో వరి సాగు చేసేటప్పుడు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన విధంగా విత్తనాలు చల్లుకోవాలి. సన్న రకాలు అయితే ఎకరాకు 18 కిలోలు, ముతక రకాలు అయితే 20 నుంచి 22 కేజీలు వేసుకోవాలి. ఒత్తుగా వేయడం వల్ల పంట పడిపోయే ప్రమాదం ఉంది. అలాగే చీడపీడలు సోకుతాయి. కాలి బాటలు తప్పనిసరి. నత్రజని తగ్గించుకోవాలి. సీ డ్రిల్‌తో విత్తనాలు వేయడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయి. విత్తన శుద్ధి ప్రధానం. – కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయ అధికారి

## విద్యార్థులకు అండగా ఎస్‌ఎఫ్‌ఐ

ఆమదాలవలస: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడేది భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ మాత్రమేనని జీవీఎంసీ కార్పొరేటర్ గంగారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ గ్రామం సమీపంలో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు మంగళవారం నాలుగో రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గడిచిన కొన్ని దశాబ్దాలుగా పేద మధ్యతరగతి విద్యార్థులకు అండగా ఉంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులను సంఘటితం చేస్తూ అనేక పోరాటాలు నిర్వహించిన ఘనత ఎస్‌ఎఫ్‌ఐకి దక్కిందని అన్నారు.

ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలు సజీవంగా ఉన్నాయంటే ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాల వల్ల నే అని అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని అన్నారు. నానాటికీ విద్యా ప్రమాణాలు దిగజారుతున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటామని తెలిపారు. ఎలాంటి సమస్యలనైనా నిర్భయంగా చెప్పుకునే ఒకే ఒక్క సంఘం ఎస్‌ఎఫ్‌ఐ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షుడు డి.చందు, సహాయ కార్యదర్శి సంతోష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జీవీఎంసీ కార్పొరేటర్ గంగారావు

## హైవే అంబులెన్స్ ఉద్యోగి నిజాయితీ

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామానికి చెందిన నేషనల్ హైవే అంబులెన్స్ ఉద్యోగి జల్లు దుర్గాప్రసాద్ తన నిజాయితీ నిరూపించుకున్నారు. ఆయన పలాస నుంచి వస్తున్నప్పుడు ఆర్టీసీ బస్సులో లభ్యమైన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకొన్న వ్యక్తి ఆచూకీ కనుక్కొని తిరిగి అతనికి మంగళవారం అప్పగించారు. పలాస పట్టణానికి చెందిన బొచ్చా సాయి తన మొబైల్ ఫోన్‌ను ఆర్టీసీ బస్సులో వస్తున్నప్పుడు జారవిడుచుకొన్నాడు. అదే బస్సులో ప్రయాణిస్తున్న దుర్గాప్రసాద్‌కు సోమవారం ఆ మొబైల్ దొరికింది. దీంతో ఆయన ఫోన్ యజమాని వివరాలు తెలుసుకొని, సమాచారం ఇచ్చాడు. దీంతో ఆ వ్యక్తి మంగళవారం మకరాంపురం గ్రామానికి రావడంతో, అతనికి స్థానికుల సమక్షంలో హైవే అంబులెన్స్ ఉద్యోగి దుర్గాప్రసాద్ ఫోన్ అప్పగించాడు. దీంతో దుర్గాప్రసాద్ నిజాయితీని అంతా మెచ్చుకున్నారు.



మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకొన్న వ్యక్తికి ఇస్తున్న హైవే అంబులెన్స్ ఉద్యోగి దుర్గాప్రసాద్

## 'రైతులకు విధిగా రశీదులు ఇవ్వాలి'

నరసన్నపేట: ఎరువుల షాపుల్లో విత్తనాల డీలర్లు అధీకృత కంపెనీల ద్వారా సరఫరా అయిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, విత్తనాలు కొన్న రైతులకు విధిగా రసీదులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ నరసన్నపేట ఏడీ రవీంద్ర భారతి అన్నారు. అలాగే అధిక ధరలకు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నరసన్నపేటలో విత్తనాల విక్రయిస్తున్న షాపులకు మంగళవారం వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షాపులో ఉన్న విత్తనాల రకాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపాలని ఏఈఓకి సూచించారు. విత్తనాలు కొన్న రైతులు విధిగా రశీదు తీసుకోవాలని, డీలర్లు కూడా తప్పనిసరిగా రైతులకు రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయాలు చేస్తే రైతులు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. అలాగే రైతులు కొన్న విత్తనాల్లో పొలంలో వేసే ముందు మొలక వేసి మొలక శాతం కట్టుకోవాలని సూచించారు. అలాగే రశీదు, విత్తనాల ప్యాకెట్(సంచి) భద్రపరచాలని చెప్పారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ రవీంద్ర భారతి

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



వరప్రసాదరావు (ఫైల్)

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే మండలం జాడు పేట గ్రామానికి చెందిన జమ్మాన వరప్రసాదరావు (27) మృతి చెందాడు. సరుబుజ్జిలి పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐ చంద్రినాయుడు తెలియజేసిన వివరాలు ప్రకారం. మంగళవారం గొట్టిపల్లిలోని తన బంధువుల ఇంటిలో పరామర్శ కోసం ఆయన ఎల్ఎన్‌పేట వచ్చాడు. తన ఊరి వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో మొబైల్ ఫుడ్ కోర్టు ఆటో వరప్రసాదరావుని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ప్రసాదరావుని స్థానికులు 108 అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుని తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, కొడుకు ఉన్నారు. జాడుపేట గ్రామంలో విషాదం అలముకుంది.

### ఇంజినీరింగ్ అధికారి రిలీవ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఇంజినీరింగ్ అధికారి అంజిత్‌కుమార్‌ను రిలీవ్ చేసినట్లు రిజిస్ట్రార్ పి.సుజాత చెప్పారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీతో ఆయన గడువు ముగిసిందని, దీంతో రిలీవ్ చేయాలని దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఉన్నతాధికారులను సంప్రదించి రిలీవ్ చేసినట్లు చెప్పారు.

## నేత్రపర్వంగా ఎండల మల్లన్న వార్షిక కల్యాణం

టెక్కలి: టెక్కలి మండలం రావివలసలో గల ఎండల మల్లికార్జునస్వామి వార్షిక కల్యాణాన్ని మంగళవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, ఈఓ వి.రాధాకృష్ణ, గ్రామ సర్పంచ్ సర్లాన బాలకృష్ణ మాజీ సర్పంచ్ బి.జగదీష్ నేతృత్వంలో అర్చకులు రామకృష్ణ, మోహన్‌రావు, యుగంధర్ పర్యవేక్షణలో భ్రమరాంబ సమేత మల్లన్నకు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో కళ్యాణం నిర్వహించారు. అంతకు ముందు తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.



టెక్కలి మండలం రావివలసలో ఎండల మల్లన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

కృష్ణలంక (విజయవాడ తూర్పు): విద్యుదాఘాతానికి గురై ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన కృష్ణలంకలో మంగళవారం జరిగింది. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం లుక్లాపేట గ్రామా నికి చెందిన జొన్నాడ నీలయ్య(50) కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సుమారు 20 ఏళ్ల కిందట భార్య, కుమారుడితో కలిసి నగరానికి వలసవచ్చి భానునగర్‌లో నివసిస్తున్నాడు. అప్పటి నుంచి భవన నిర్మాణ పనుల్లో భాగంగా సిమెంట్ కబోర్డులు నిర్మించే పనికి మేస్త్రీ వెంట కూలికి వెళ్తున్నాడు. మంగళవారం ఉదయం కృష్ణలంక, శంకరమఠం రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఒక ఇంటిలో కబోర్డుల పనికి వెళ్లాడు. పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తోటి కార్మికులు హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి నీలయ్యను తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.



మృతి చెందిన కార్మికుడు నీలయ్య

### అంబరాన్నంటిన సంబరం



పార్వతీపురానికి చెందిన అఘోరాల ప్రదర్శన



చింతామణి అమ్మవారు, గజముద్దల ఊరేగింపు

ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం, కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారి సంబరం మంగళవారం అంబరాన్ని తాకేలా జరిగింది. ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన వీధి నాటకాలు, విచిత్ర వేషధారణలు అలరించాయి. అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దలు 9 ఏర్పాటు చేశారు. రెండు కాళికా వేషధారణలు సంబరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– కవిటి